మరో 157 ఎకరాల అసైన్డ్ భూమికి ఎసరు!

హైదరాబాద్, మార్చి 13(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎక్కడా అసైన్డ్ భూములను రాష్ట్ర ప్రభుత్వం వదలడం లేదు. పారిశ్రామికవాడల ఏర్పాటు పేరుతో వరుసగా భూసేకరణ నోటిఫికేషన్లను జారీ చేస్తూ రైతులను ఆందోళనలకు గురిచేస్తున్నది. రంగారెడ్డి జిల్లా కొంగరఖుర్ద్‌లో 277 ఎకరాల అసైన్డ్ భూముల సేకరణకు బుధవారం నోటిఫికేషన్ జారీచేయగా.. తాజాగా గురువారం సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల పరిధిలో 157.23 ఎకరాల అసైన్డ్ భూమిని సేకరించేందుకు సర్కారు నోటిఫికేషన్ జారీచేసింది. ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం భూములు సేకరిస్తున్నట్టు, సంబంధిత ప్లాన్ కలెక్టరేట్‌లో ఉన్నట్టు జిల్లా కలెక్టర్ ఆ నోటిఫికేషన్‌లో తెలిపారు. ఈ భూముల క్రయవిక్రయాలు, లీజుకి ఇవ్వడం వంటి లావాదేవీలు నిర్వహించకూడదని అందులో పేర్కొన్నారు. అభ్యంతరాలు ఉన్నవారు 60 రోజుల్లోగా జిల్లా కలెక్టర్, లేక అధీకృత అధికారి సమక్షంలో తమ అభ్యంతరాలను నమోదు చేసుకోవచ్చని సూచించారు.

రైతులకు నిద్రలేని రాత్రులు

రంగారెడ్డి, మెదక్, నల్లగొండ తదితర ఉమ్మడి జిల్లాల్లోని అనేక ప్రాంతాలు హైదరాబాద్‌కు సమీపంలో ఉండటంతో సహజంగానే ఆ ప్రాంతాల్లోని భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కోట్ల రూపాయల భూములకు అరకొరగా నష్టపరిహారం చెల్లిస్తుండటంతో జీవనోపాధి కోల్పోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అన్నీ పచ్చని పంట పొలాలే....

వాస్తవానికి పారిశ్రామిక అవసరాల కోసం వ్యవసాయ యోగ్యం కాని భూములను, ప్రభుత్వ భూములను ఎంపిక చేయాల్సి ఉంటుంది. తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే సంబంధిత రైతుల అనుమతి మేరకే పంట పొలాలను సేకరించాల్సి ఉంటుంది. కానీ, రాష్ట్ర ప్రభుత్వం రైతులతో సంప్రదింపులు జరపకుండానే ఏకపక్షంగా భూసేకరణ నోటిఫికేషన్లు జారీచేస్తున్నది. లగచర్లలో ఏకపక్ష భూసేకరణపై ఇప్పటికే హైకోర్టు స్టే విధించగా, మిగిలిన ప్రాంతాల్లో రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ఈ నేపథ్యంలో రైతుల ఆందోళనలను లెక్కచేయకుండా రోజుకో ప్రాంతంలో పోలీసు పహరాలో బలవంతంగా భూసేకరణకు చర్యలు చేపట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రజల బాధలు ప్రసారం చేస్తే అరెస్టులా?

- ప్రజాస్పందనను బయటపెట్టిన జర్నలిస్టులకు సంకెళ్లా?
- ప్రశ్నించడం పౌరుల హక్కు.. ప్రసారం మీడియా బాధ్యత
- మహిళా జర్నలిస్టులకు సంకెళ్లు వేసే సంస్కృతి ఎక్కడిది?
- జర్నలిస్టుల గొంతు నొక్కడం ఎప్పటికీ సాధ్యం కాదు
- ఇద్దరు మహిళా జర్నలిస్టుల అక్రమ అరెస్టుపై తెలంగాణ జర్నలిస్టు సంఘాల మండిపాటు

రేవతి, పల్స్ న్యూస్ మేనేజింగ్ డైరెక్టర్

తన్వీయాదవ్, న్యూస్ రిపోర్టర్

హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ): ఓ రైతు ఆవేదనను, ఆక్రందనను తమ చానల్‌లో ప్రసారం చేసిన ఇద్దరు మహిళా జర్నలిస్టులను అరెస్టు చేయడంపై జర్నలిస్టు సంఘాల నేతలు, సీనియర్ జర్నలిస్టులు మండిపడ్డారు. ప్రజల అభిప్రాయాలను, భావోద్వేగాలను వార్తగా రాస్తే, చానళ్లలో ప్రసారం చేస్తే జర్నలిస్టులను, ఆయా సంస్థల నిర్వాహకులను ఎలా నిర్బంధిస్తారని ప్రశ్నించారు. మగ పోలీసులు మఫ్టీలో వెళ్లి ఓ తీవ్రవాదిని అరెస్టు చేసినట్టుగా పల్స్ న్యూస్ మేనేజింగ్ డైరెక్టర్ రేవతి ఇంటిని చుట్టుముట్టి ఆమెను అదుపులోకి తీసుకోవడాన్ని ఖండించారు. న్యూస్ రిపోర్టర్ తన్వీ యాదవ్‌ను కూడా పోలీసులు నిబంధనలను ఉల్లంఘిస్తూ అరెస్టు చేయడాన్ని ఆక్షేపించారు. రేవతి అరెస్టును బుధవారం 'ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా' ఖండించగా, గురువారం జర్నలిస్టు సంఘాల నేతలు, సీనియర్ ఎడిటర్లు, జర్నలిస్టులు స్పందించారు. ప్రశ్నించడం పౌరుల ప్రాథమిక హక్కు అని, దానిని ప్రసారం చేయడం మీడియా బాధ్యత అని, తమకు వ్యతిరేకంగా మాట్లాడించారని ఆరోపిస్తూ ప్రభుత్వం మహిళా జర్నలిస్టులపై కేసులు పెట్టి సంకెళ్లు వేయడం ఎటువంటి సంస్కృతి అని నిలదీశారు. అక్రమ కేసు పెట్టడంతోపాటు అరెస్టు ప్రక్రియ కూడా అనుమానాలకు తావిస్తున్నదని పేర్కొన్నారు. అక్రమ అరెస్టులతో జర్నలిస్టుల గొంతు నొక్కాలనుకొంటే అది ఎప్పటికీ సాధ్యం కాదు' అని పేర్కొన్నారు..

అసహనం నుంచి వచ్చిన ఫలితం

తెలంగాణలో ముఖ్యమంత్రి మీద అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని, విభజనలను రెచ్చగొడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారనే అభియోగాలతో ఇద్దరు మహిళా జర్నలిస్టులను అరెస్టు చేయడం దారుణం. వారిని అరెస్టు చేయడం సమస్యకు పరిష్కారం కాదు. ఇది అసహనం అనే అంటువ్యాధి ఫలితంగా వచ్చిన పరిణామం.

-కపిల్ సిబల్, రాజ్యసభ సభ్యుడు

అక్రమ కేసులు విరమించుకోవాలి

ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు అందరికీ ఉన్నది. ప్రజలను తప్పుదోవ పట్టించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. తమకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రజల హక్కు. ప్రజల బాధలను, ఎమోషన్లను ప్రసారం చేయడం జర్నలిస్టుల బాధ్యత. జర్నలిస్టుల మీద పెట్టిన అక్రమ కేసులను వెంటనే విరమించుకోవాలి. అరెస్టు చేసిన ఇద్దరు మహిళా జర్నలిస్టులను భేషరతుగా విడుదల చేయాలి. ఇదేవిధంగా నిరంకుశంగా వ్యవహరిస్తే ప్రజలు తగిన బుద్ధి చెప్తారు. అధికారం ఉన్నది కదా అని చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని ప్రజల హక్కులను కాలరాయవద్దు.

-చంటి క్రాంతికిరణ్, మాజీ ఎమ్మెల్యే, జర్నలిస్టుల సంఘం నేత

ప్రభుత్వానికి స్వీయనియంత్రణ ఉండాలి

రేవంత్‌రెడ్డి సర్కారు ఆలోచనలు, అనుసరిస్తున్న పద్ధతులు, పనుల గురించి గ్రామీణ ప్రజలు కూడా అర్థం చేసుకున్నారు. ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై మాట్లాడుకుంటున్నారు. కడుపు మండిన రైతులు, ప్రజలు బహిరంగంగానే తిడుతున్నరు. దీనిని జీర్ణించుకోలేని సర్కారు అణచివేయాలని చూస్తున్నది. ఇద్దరు మహిళా జర్నలిస్టుల అరెస్టును కూడా ఇందులో భాగంగానే చూడాలి. పోలీసులు కూడా రాజ్యాంగబద్ధంగా పనిచేయాలి. ఇద్దరు మహిళా జర్నలిస్టులను అరెస్టు చేయడానికి తెల్లవారుజామున 40 మంది పోలీసులను పంపించాల్సిన అవసరం ఏమొచ్చింది. వారు టెర్రరిస్టులు కాదు.. జర్నలిస్టులు నిత్యం ప్రజలతో మమేకమయ్యే సాధారణ పౌరులు. కనీస నాగరికత ఉండాలి. ఉగ్రవాదులను అరెస్టు చేసినట్టు చేయడాన్ని ఖండిస్తున్నా.

-టంకశాల అశోక్, సీనియర్ ఎడిటర్

ప్రశ్నించడం పౌరుల ప్రాథమిక హక్కు

వీడియో ఉన్న సమాచారం, విశ్లేషణ విషయం పక్కనబెడితే పౌరులను అరెస్టు చేసే ముందు అవసరమైన ప్రక్రియను అనుసరిస్తే బాగుండేది. ప్రశ్నించడం పౌరుల ప్రాథమిక హక్కు. తప్పు ఒప్పులను నిర్ణయించేవి కోర్టులు. ఏ పౌరుడినైనా అరెస్టు చేసే ముందు పూర్వాపరాలు ఆలోచించి హక్కులకు భంగం వాటిల్లకుండా అరెస్టు చేస్తే బాగుండేది. హఠాత్తుగా అదుపులోకి తీసుకోవడం అనుమానాలకు తావిస్తున్నది.

-వనం జ్వాల నర్సింహారావు, కాలమిస్టు

అప్రకటిత ఎమర్జెన్సీ

మహిళా జర్నలిస్టుల అరెస్టు అన్యాయం. ఇది మహిళా హక్కులను కాలరాయడమే. తెల్లవారుజామున ఐదు గంటలకు అరెస్టు చేయాల్సిన అవసరం ఏమొచ్చింది. వారు ఎక్కడికైనా పారిపోతారా? వారు టెర్రరిస్టులు కాదు. మహిళా సాధికారత, మహిళా హక్కుల గురించి మాట్లాడే కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా జర్నలిస్టుల గొంతు నొక్కడం దారుణం. ప్రభుత్వాల అణచివేత ఇలాగే కొనసాగితే జర్నలిజంలోకి మహిళలు రావడానికి భయపడతారు. ఇది అప్రకటిత ఎమర్జెన్సీని తలపిస్తున్నది.

-జూలూరు గౌరీశంకర్, సీనియర్ జర్నలిస్టు

భయభ్రాంతులకు గురిచేయడం అసమంజసం

ఇద్దరు మహిళా జర్నలిస్టులను తెల్లవారుజామున అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నా. వారిపై ఈ నెల 10న ఫిర్యాదు చేస్తే ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కేసులు పెట్టారు. అక్రమ కేసులు పెట్టి మహిళా జర్నలిస్టులను భయభ్రాంతులకు గురిచేయడం సమంజసం కాదు. కేసులను విరమించుకుని విడుదల చేయాలి

-అస్కానీ మారుతిసాగర్, టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి

ప్రజల బాధలు చూపించడం జర్నలిస్టుల బాధ్యత

ప్రజల బాధలను, వారి భావోద్వేగాలను చూపించడం జర్నలిస్టుల బాధ్యత. హైడ్రా పేదల ఇండ్లు కూల్చివేస్తున్న సమయంలో ప్రజల ఎమోషన్స్‌ను ఎవరు ఆపగలరు? వాటిని రికార్డు చేసి టీవీ చానళ్లలో, యూట్యూబ్స్‌లో ప్రసారం చేయడం జర్నలిస్టుల విధి. ప్రజాస్వామ్యాన్ని కాపాడే నాలుగో స్తంభంగా మీడియా ప్రతినిధులుగా మా విధులు మేము నిర్వహిస్తుంటాం. ఇద్దరు మహిళా జర్నలిస్టులను అరెస్టు చేయడం దారుణం. వారు ఎవరూ ప్రభుత్వంపై నేరుగా ఎలాంటి వ్యాఖ్యానాలు, విమర్శలు చేయలేదు. కేవలం రైతు బాధను రికార్డు చేసి ప్రసారం చేశారు. టెర్రరిస్టుల, దోపిడీ దొంగల మాదిరిగా కండ్లను మార్క్ చేసి ఫొటోలు రిలీజ్ చేయడం ఏమిటి? ఆడపిల్లలను చూసి ఎందుకు భయపడుతున్నరు. గతంలో కొండారెడ్డిపల్లెలో కూడా మాపై ఇలాగే దౌర్జన్యం చేశారు. అక్రమ అరెస్టులతో జర్నలిస్టుల గొంతు నొక్కాలనుకొంటే ఎప్పటికీ సాధ్యం కాదు.

- సరితాయాదవ్, సీనియర్ జర్నలిస్టు

మహిళా జర్నలిస్టులను కస్టడీకి ఇవ్వండి

- కోర్టును కోరిన పోలీసులు.. ముగిసిన వాదనలు
- 17న నిర్ణయం వెలువరించనున్న న్యాయస్థానం

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, మార్చి 13 (నమస్తే తెలంగాణ): పల్స్ న్యూస్ మేనేజింగ్ డైరెక్టర్ పీ రేవతి, న్యూస్ రిపోర్టర్ బండి సంధ్య అలియాస్ తన్వీ యాదవ్‌లను ఐదు రోజుల కస్టడీకి ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై గురువారం వాదనలు ముగిశాయి. నిందితుల నుంచి నేరాంగీకార వాంగ్మూలాన్ని నమోదు చేయాల్సి ఉన్నదని, వీరిపై ఉన్న ఇతర కేసుల గురించి సమాచారాన్ని సేకరించాల్సి ఉన్నదని పోలీసులు పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిపై అభ్యంతరకర పోస్టులు పెట్టేందుకు ప్రోత్సహించిన వారి పేర్లను ఆరా తీసేందుకు అవకాశమివ్వాలని కోరారు. పరారీలో ఉన్న ఇతర నిందితుల వివరాలను సేకరించాల్సి ఉన్నదని తెలిపారు. వారి దగ్గర నుంచి మొబైల్ ఫోన్లను, లాప్‌టాప్, హార్డ్‌డిస్క్‌ల్లో నిక్షిప్తమైన వీడియోలను జప్తు చేయాల్సి ఉన్నదని చెప్పారు. బీఆర్ఎస్ ప్రముఖులతో వీరికున్న సంబంధాలపై ఆరా తీయాల్సి ఉన్నదని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిపై వ్యతిరేక వార్తల్ని ప్రసారం చేసేందుకు ఎవరెవరి నుంచి పల్స్ న్యూస్ యూట్యూబ్ చానల్‌కు డబ్బులు అందుతున్నాయో తెలుసుకోవాల్సి ఉన్నదని వివరించారు. సాక్ష్యాధారాలను జప్తు చేసేందుకు సమయం సరిపోలేదని, విచారణకు నిందితులు సహకరించకపోవడంతో బుధవారం హడావుడిగా కోర్టు ఎదుట హాజరుపర్చాల్సి వచ్చిందని తెలిపారు. నిందితుల తరఫు న్యాయవాది కిరణ్ కుమార్ వాదనలు వినిపిస్తూ విచారణ పూర్తి చేసినట్టు అధికారులు రిపోర్టులో పేర్కొన్నారని, మహిళా జర్నలిస్టులను కస్టడీకి ఇవ్వాల్సిన అవసరం లేదని వాదించారు. వాదనలు కొనసాగుతున్న సమయంలోనే మేజిస్ట్రేట్ తీర్పును 17కు రిజర్వు చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. నిందితుల బెయిల్ పిటిషన్లపై సైతం తీర్పును అదేరోజు ప్రకటించనున్నట్టు కోర్టు స్పష్టం చేసింది.

షోకాజ్ నోటీసులపై కోర్టుకు వివరణ

ఈ కేసు నమోదుకు సంబంధించి నిందితులకు 111 సెక్షన్ ఎలా వర్తిస్తుందో తెలపాలని, మహిళల అరెస్టులో మగ పోలీసుల తీరుపై వివరణ ఇవ్వాలని దర్యాప్తు అధికారి ఎస్ నరేశ్‌కు కోర్టు షోకాజ్ నోటీసులు జారీచేసింది. ఈ నోటీసులకు సోమవారం లోపు వివరణ ఇవ్వాలని ఆదేశించింది. నిందితుల్ని అరెస్టు చేసినట్టు వారి కుటుంబసభ్యులకు ఎందుకు సమాచారం అందించలేదో తెలియజేయాలని సూచించింది.

ప్రశ్నించే వారి గొంతు నొక్కడమే ప్రజాపాలనా?

ప్రశ్నించేవారి గొంతులు నొక్కడమేనా ప్రజాపాలన అంటే? అని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సబితాఇంద్రారెడ్డి, కోవ లక్ష్మి ప్రశ్నించారు. ప్రజాసమస్యలను వెలుగులోకి తెచ్చిన రేవతి, తన్వీయాదవ్ అరెస్ట్‌ను వారు తీవ్రంగా ఖండించారు. సీఎం రేవంత్‌రెడ్డి హోంమంత్రిత్వశాఖను తనవద్దే పెట్టుకొని తన కనుసన్నల్లోనే జర్నలిస్టులపై దాడి చేయిస్తున్నారని ఆరోపించారు. గతంలో సీఎం సొంతూరైన కొండారెడ్డిపల్లిలో మహిళా జర్నలిస్ట్ విజయారెడ్డి, సరితపై దాడి చేయించారని గుర్తుచేశారు. కోవ లక్ష్మి మాట్లాడుతూ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి స్పీకర్‌పై ఏం మాట్లాడారో పూర్తిగా తెలుసుకోకుండానే స్పస్పెన్షన్ వేటే వేయడం ఎంతవరకు కరెక్ట్ అన్నారు. ఆరు గ్యారెంటీల గురించి మాట్లాడని కాంగ్రెస్ సభ్యులు జగదీశ్‌పై ఒంటికాలిపై లేవడం బాధాకరమని అన్నారు.

- ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, కోవ లక్ష్మి

హోంగార్డుల వేతనాలు 13రోజులు ఆలస్యం

పిల్లల ఫీజులు, ఇంట్లో ఖర్చులు, అద్దెలతో సతమతం

హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ): హోంగార్డులకు ఈ నెల వేతనం 13 రోజులు ఆలస్యంగా పడింది. ఇప్పటికే చాలీచాలని వేతనాలతో కాలం వెళ్లదీస్తున్న హోంగార్డులకు సకాలంలో వేతనాలు రాక నానా ఇబ్బందులు పడుతున్నారు. బీఆర్ఎస్ హయాంలో 1, 2 తేదీల్లోనే పడే వేతనాలు.. కాంగ్రెస్ హయాంలో ప్రతినెలా 9వ తారీఖు తర్వాతే పడుతున్నాయి. వేతనం సకాలంలో ఖాతాల్లో జమ కాకపోవడంతో చెక్‌బౌన్స్‌లు అవుతున్నాయని, ఈఎంఐ తేదీలు ముగిసిపోయి సిబిల్ స్కోర్ పడిపోతున్నదని వాపోతున్నారు. ఇక పిల్లల స్కూల్ ఫీజులు, ఇంట్లో ఖర్చులు, అద్దెలకు ఇబ్బందులు తప్పడం లేదని చెబుతున్నారు. గతంలో సమయానికి వేతనాలు రావడంతో ఈఎంఐలు 5వతేదీకి పెట్టుకోగా, ఇప్పుడు ఆలస్యమవుతుండటంతో తాము ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని తెలిపారు.

దళిత రైతుపై దౌర్జన్యం

- అప్పు కట్టాలని అన్నదాతకు నోటీసు
- ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ దిక్కులేదు
- బ్యాంకోళ్లు మాత్రం లోన్ కట్టాలని బెదిరిస్తున్నరు
- మహబూబాబాద్ జిల్లా రైతు యాకన్న ఆవేదన
- నర్సింహులపేట మండలంలో 20 మందికి తాఖీదులు

FORM NO.2
(Rule 32 (3) of the rules framed under the Act)
Demand Notice (Distraint Order)

యాకన్నకు డీసీసీ అధికారులు ఇచ్చిన నోటీసు

నర్సింహులపేట, మార్చి 13 : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులందరికీ రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసిందని సాక్షాత్తూ శాసనసభ సాక్షిగా గవర్నర్ ప్రకటించి 24 గంటలు గడవకముందే ఓ దళిత రైతులపై బ్యాంకు అధికారులు చేసిన దౌర్జన్యం వెలుగుచూసింది. తాను అర్హుడైనా కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేయకపోవడంతో సదరు రైతు అప్పు తెచ్చి బ్యాంకు రుణం చెల్లించాల్సి వచ్చింది. కాంగ్రెస్ సర్కారులో దళిత రైతులకు జరుగుతున్న అన్యాయానికి ఈ ఘటనే సాక్ష్యంగా నిలిచింది.

జెండాలు పాతి వేలం వేస్తం

సాగునీళ్లు లేక ఓవైపు పంటలు ఎండిపోతున్నాయి.. మరోవైపు పెట్టుబడి కోసం చేసిన అప్పులు మాఫీకాక, రైతుభరోసా అందక మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందాన తిప్పలు పడుతున్న రైతులకు డీసీసీ బ్యాంకు అధికారులు నోటీసులు ఇచ్చి మరింత ఆగం చేస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలోని వివిధ గ్రామాల్లో భూముల మార్జిగేజ్‌పై తీసుకున్న రుణాల చెల్లింపులు ఆలస్యమయ్యాయంటూ బ్యాంకు అధికారులు 20 మంది రైతులకు నోటీసులిచ్చారు. రుణాలు చెల్లించకపోతే జెండాలు పాతి భూములు వేలం వేస్తామని బెదిరింపులకు దిగుతున్నట్టు రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. భూముల్లో జెండాలు పాతితే పరువు పోతుందని వడ్డీ వ్యాపారుల దగ్గర అప్పు తెచ్చి బ్యాంకు అధికారులకు చెల్లించామని కొందరు రైతులు వాపోయారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షలలోపే బ్యాంకు అప్పులున్నా తమకు రుణమాఫీ కాలేదని, బ్యాంకు వాళ్లు మాత్రం ముక్కుపిండి తమ నుంచి రుణాలు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అర్హత గల రైతులకు ఇచ్చే పైసలకే దిక్కులేదుగాని, తాము కట్టాల్సిన బకాయిలకు మాత్రం నోటీసులు పంపించి ఇబ్బందులు పెడుతున్నారని మండిపడుతున్నారు.

3 లక్షలు వడ్డీకి తెచ్చి కట్టిన

మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల కేంద్రంలోని పీఏసీఎస్ నుంచి 2019లో రూ.90 వేల పంట రుణం తీసుకున్న. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించిన నాటికి వడ్డీతో సహా మొత్తం రూ. 1.25 లక్షలు అయ్యింది. అయినా నాకు రుణమాఫీ కాలేదు. నా లోన్ అకౌంట్ నంబర్‌కు మరొక రైతు ఆధార్ నంబరు నమోదు చేయడం వల్ల రుణమాఫీ కాలేదని పీఏసీఎస్, వ్యవసాయ అధికారులు చెప్తున్నారు. పలుమార్లు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా రుణమాఫీ కాలేదు. 2020లో మరిపెడ డీసీసీబీలో రూ.5 లక్షల మార్ట్‌గేజ్ లోన్ తీసుకున్నా. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా 2023-24 ఏడాదికి రూ.2 లక్షలు కట్టాను. మళ్లీ ఇప్పుడు రూ.5,71,294 చెల్లించాలని డీసీసీ అధికారులు నోటీసులు ఇచ్చారు. పైసలు కట్టకపోతే జెండాలు పాతి భూమిని వేలం వేస్తామని బెదిరిస్తున్నారు. సాగు భూమిని ఎక్కడ వేలం వేస్తారోనని కుమిలిపోతున్నా. పదిమందిలో పరువు పోతుందనే భయంతో రూ.3లక్షల అప్పు తెచ్చి కట్టిన. ప్రభుత్వమేమో రూ.2లక్షల రుణమాఫీ 100 శాతం పూర్తయిందని ప్రకటించింది. నాకెందుకు మాఫీ కాలేదు.

-మందుల యాకన్న, రైతు, జయపురం

భద్రాద్రి రాముడికి ఎంత అపచారం!

- నవమి వేడుకల ప్రారంభం వేళ భద్రాద్రిలో అనూహ్య ఘటన
- తప్పిదం కారణంగా ఉప ప్రధాన అర్చకుడి బదిలీ
- శ్రీరామ నవమి రీత్యా అతడిని రప్పించాలన్న అర్చకులు
- ఎట్టకేలకు దిగివచ్చిన ఈవో.. వేడుకలు ప్రారంభం

అంకురార్పణ నిర్వహించకుండా నిరసన తెలుపుతున్న అర్చకులు

భద్రాచలం, మార్చి 13: శ్రీరామనవమి మహోత్సవాల ప్రారంభం వేళ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో అనూహ్య పరిణామం చోటుచేసుకున్నది. శుక్రవారం నుంచి ఆలయంలో వేడుకలు ప్రారంభం కావాల్సి ఉండగా అంకురార్పణ కార్యక్రమాన్ని అర్చక బృందం గురువారం రాత్రి నిలిపివేసింది. వివరాలిలా ఉన్నాయి. ఓ భక్తుడు అభిమానంతో అందించిన నగదును రామాలయ ఉప ప్రధాన అర్చకుడు శ్రీనివాస రామానుజం స్వీకరించారన్న కారణంతో అతడిపై ఆలయ ఈవో రమాదేవి ఆగ్రహం వ్యక్తంచేశారు. చర్యల్లో భాగంగా రెండు రోజుల క్రితం అతడిని పర్ణశాల శ్రీసీతారామచంద్రస్వామి ఆలయానికి బదిలీ చేశారు. ఇదే విషయమై ఇక్కడున్న అర్చకులంతా వెళ్లి గురువారం ఉదయం ఈవోను కలిశారు. శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకొని శ్రీనివాస రామానుజాన్ని మళ్లీ భద్రాచలానికి రప్పించాలని కోరారు. ఇకపై అతడు అలాంటి తప్పిదాలకు పాల్పడకుండా తాము పర్యవేక్షిస్తామని భరోసా ఇచ్చారు. ఈ మేరకు లేఖ కూడా రాసి ఈవోను విజ్ఞప్తి చేశారు. ఉప ప్రధాన అర్చకుడు లేకుండా శ్రీరామనవమి వంటి పెద్ద మహోత్సవాన్ని నిర్వహించడం కష్టతరమే అవుతుందని వివరించారు. ఆలయ కైంకర్యాలు చేయడానికి అతడిని అనుమతించాలని కోరారు. శ్రీరామనవమి వేడుకలు ముగిసిన తరువాత అతడిని బదిలీ చేసినా తమకు అభ్యంతరం లేదని స్పష్టంచేశారు. కానీ సాయంత్రం వరకూ ఈవో నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో తాము అంకురార్పణ కార్యక్రమాన్ని నిర్వహించలేమంటూ అర్చకులు భీష్మించారు. ఈ విషయంలో అర్చకులకు, ఈవోకు మధ్య సయోధ్య కుదిర్చేందుకు కిందిస్థాయి ఉద్యోగులు రాత్రి వరకూ చేసిన చర్చలు విఫలమైనట్టు తెలుస్తున్నది. అంకురార్పణ అర్ధాంతరంగా నిలిచిపోవడంతో రామయ్య దర్శనానికి వచ్చిన భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రాత్రి 10 గంటలకు ప్రారంభం..

ఎట్టకేలకు రాత్రి పది గంటల సమయంలో ఈ వివాదం సద్దుమణిగింది. ఈవో రమాదేవి అర్చకుల వద్దకు వెళ్లి చర్చించారు. ఉప ప్రధాన అర్చకుడు తప్పిదానికి పాల్పడినప్పటికీ అర్చకులు అతడిని వెనుకేసుకొని రావడం ద్వారా ఆలయ ప్రతిష్ట దెబ్బతినే ప్రమాదం ఉన్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉప ప్రధాన అర్చకుడు లేకుండా వేడుకలు జరపలేమని అర్చకులు తేల్చిచెప్పారు. ఎట్టకేలకు ఉప ప్రధాన అర్చకుడిని ఈవో పిలిపించారు. రాత్రి పది గంటల సమయంలో అతడు అంకురార్పణ చేయడంతో నవమి వేడుకలు ప్రారంభమయ్యాయి.

10 లక్షలు ఇస్తా... నా భర్తను చంపేయండి!

- భర్త హత్య కోసం భార్య సుపారీ
- ముఠా సభ్యుడి అత్యాశతో లీక్
- పోలీస్‌స్టేషన్‌లో భర్త ఫిర్యాదు
- భార్య సహా నలుగురు ముఠా సభ్యుల అరెస్టు

నర్సంపేట, మార్చి13 : ఏకంగా కట్టుకున్న భర్తనే కడతేర్చాలని చూసింది ఓ భార్య. 10లక్షలు ఇస్తా...నా భర్తను చంపేయండి... అంటూ ఓ ముఠాకు ఆఫర్ ఇవ్వగా ముఠా సభ్యుడి అత్యాశతో సీన్ రివర్స్ అయిన ఘటన వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ఆకులతండాలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. నర్సంపేట మండలం ఆకులతండాకు చెందిన ధరావత్ సుమన్‌కు ఇదే మండలం మహేశ్వరం తండాకు చెందిన భూక్యా మంజులతో 2018లో వివాహం జరిగింది. వీరి ఒక పాప ఉన్నది. సుమన్ హైదరాబాద్‌లోని ఓ ప్రభుత్వ రంగ సంస్థలో బ్యాంకు పీవోగా విధులు నిర్వర్తిస్తున్నాడు. 3 సంవత్సరాలుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. దీంతో మంజుల ఎలాగైనా భర్తను వదిలించుకోవాలని చూసింది. మంజుల బావ, సమీప బంధువు నర్సంపేట మండలం మహేశ్వరం గ్రామానికి చెందిన మోతీలాల్ సహాయంతో ముఠా సభ్యులను కలిసి సుపారీకి ఆఫర్ చేసింది. ముఠా సభ్యులైన రాయపర్తి మండలానికి బానోత్ నరేశ్, తొర్రూరు మండలానికి చెందిన మల్లేశ్, నర్సంపేట మండలం ఆకులతండాకు చెందిన గోపితో రూ.10లక్షల డీల్ మాట్లాడుకున్నది. ఈ ముఠా సభ్యులు హోలీ తర్వాత సుమన్‌ను హత్య చేసేందుకు ప్లాన్ చేసుకున్నారు. కొన్ని రోజుల క్రితం సుమన్‌కు రాయపర్తి మండలానికి చెందిన నరేశ్ ఫోన్ చేసి రూ.3 లక్షలు ఇస్తే విలువైన సమాచారం ఇస్తానని చెప్పాడు. ఈ ఈ మేరకు బాధితుడు రెండు రోజుల క్రితం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు విచారణ వేగవంతం చేశారు. నరేశ్ ఫోన్‌ను ట్రాప్ చేయడంతో అసలు విషయం బయటపడింది. ఒక్కొక్క ముఠా సభ్యుడికి రూ.30వేల చొప్పున ముగ్గురికి అడ్వాన్స్ పేమెంట్ కూడా ముట్టజెప్పినట్టు దర్యాప్తులో వెల్లడైంది. ఈ డీల్‌లో ఆకులతండాకు చెందిన గోపి ప్రధాన భూమికను పోషించాడు. మంజుల, మోతీలాల్, ముఠా సభ్యులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపారు.

సెంట్రల్ వర్సిటీ భూములపై గురి

మొదటిపేజీ తరువాయి...

సిద్ధమవడం సిగ్గుచేటని విమర్శిస్తున్నారు. ఈ మేరకు గురువారం విద్యార్థులు పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ప్రభుత్వం విక్రయించేందుకు గుర్తించిన భూముల వద్దకు వెళ్లి 'భూదోపిడీని అరికట్టండి... యూనివర్సిటీ భూములను తిరిగి చ్చేయండి' అంటూ బ్యానర్లు ప్రదర్శించారు. రేవంత్ ప్రభుత